# చివరికి తమిళులకు ఏమీ దక్కదా?

కె. బాలగోపాల్

> **భారత ఫెడరలిజాన్ని కుదించి తయారుచేసిన 13వ రాజ్యాంగ సవరణ అమలు చేస్తే చాలని శ్రీలంక ప్రభుత్వానికి ఇండియా, అమెరికా హితవు చెప్తున్నాయి. 'చూద్దాం, తొందరేముంది' అని రాజపక్షె అంటున్నాడు. అతని మీద ఏరకమైన ఒత్తిడి పెట్టే స్థితిలో శ్రీలంక తమిళులు లేకపోవడం అన్నిటి కంటె విచారకరం.**

శ్రీలంక తమిళులకు స్వయం పాలన పోనీండి కనీసం అధికార వికేంద్రీకరణ కూడ ఇచ్చేది లేదని ఆ దేశ అధ్యక్షుడు రాజపక్షె స్పష్టం చేస్తున్నాడు. 'మా దృష్టిలో రాజకీయ పరిష్కారానికి తొందరేమీ లేదు. ముందు తమిళుల పునరావాసం, తరువాత ఆర్థిక అభివృద్ధి. అధికార వికేంద్రీకరణ సంగతి ఆపైన చూద్దాం' అన్నవి అతని మాటలు. ఆ వికేంద్రీకరణ ఏ మేరకు ఉండబోతుందన్నదానికి కూడ సంకేతం ఇచ్చేశాడు. 'తమిళులను ఫెడరలిజం గురించి మరచిపొమ్మనండి' అని 'ది హిందూ' దినపత్రిక సంపాదకుడికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడు. నిజానికి ఆ ఇంటర్వ్యూలో, అడుగుతున్న వ్యక్తి సానుభూతిగా అడగడం వల్ల కాబోలు మామూలుగా పాటించే జాగ్రత్తలు కూడ రాజపక్షె పాటించే ప్రయత్నం చేయలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలోని దేశాధ్యక్షుడిలాగ కాక తన ఎస్టేట్ గురించి మాట్లాడుతున్న జమీందార్ లాగ జవాబులిచ్చాడు.

రాజకీయ పరిష్కారాన్ని వాయిదా వేయడానికి ఒక అతి తెలివి వాదన చేశాడు. ఘర్షణల కారణంగా తన పడవ పోగొట్టుకున్న తమిళ మత్స్యకారుడిని నీకు పడవకావాలా లేక అధికార వికేంద్రీకరణ కావాలా అంటే పడవే కావాలంటాడు. కాబట్టి ముందు పునరావాసం, తరువాత ఆర్థిక అభివృద్ధి, ఆ పైనే రాజకీయ పరిష్కారం అంటాడు. మరి ఎల్‌టిటిఇ మీద యుద్ధం చేస్తున్న కాలంలో సైన్యంలో సిపాయిగా ఉన్న సింహళీయుడి అమ్మ నాయనలను మీకు మీ కొడుకు ప్రాణం కావాలా లేక దేశ సమగ్రత కావాలా అని అడిగితే కొడుకు ప్రాణం కావాలనే అని ఉందురు. అంత మాత్రం చేత రాజపక్షె యుద్ధం ఆపి ఉండేవాడు కాడు. అసలు వారిని అడిగి ఉండే వాడే కాడు.

అతను ప్రథమ కర్తవ్యంగా భావించే పునరావాసం ఏ విధంగా ఉండబోతుంది? 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనే కాక ఇతర సందర్భాలలో కూడ 'తమిళులను తిరిగి జంగిల్‌లోకి పంపించడం నాకు ఇష్టం లేదు' అన్నాడు. అవి వాళ్ళ ఊర్లు. అక్కడ వాళ్ళ ఇళ్లు ఉండేవి (కొన్ని చోట్ల ఇప్పటికీ ఉన్నాయి). వాళ్ళ భూములున్నాయి. ఆ ఊర్లను పునర్నిర్మించి వారిని తిరిగి అక్కడికి పంపడం 'జంగిల్‌కు పంపడం' ఎందుకయింది? అక్కడ ఎల్‌టిటిఇ మందు పాతరలు పెట్టిందని అంటున్నారు. ఎల్‌టిటిఇ పేల్చితే పేలే మందుపాతరలు పెట్టిందిగానీ ఒత్తిడికి పేలేవి పెట్టిందా? పెట్టి ఉంటే 3 లక్షల మంది తమిళులు వాటి బారిన పడకుండ ఉత్తర ప్రాంతం నుంచి బయటికెట్లా వచ్చారు? తప్పించుకొని పారిపోతున్న తమిళ ప్రజలను ఎల్‌టిటిఇ వెనక నుంచి కాల్చగా చనిపోయిన వారు చాలా మంది ఉన్నారు కానీ మందుపాతరలు తొక్కడం వల్ల చనిపోయిన వారి గురించి వినలేదు.

రాజపక్షె తటపటాయింపుకు వేరే కారణాలున్నాయి. 2004లో సునామీ వచ్చినప్పుడు ఆ ప్రాంతాన్ని (ఇండియా తదితర దేశాల సహాయంతో) బాగు చేసిన తరువాత అక్కడి నుంచి పారిపోయి వచ్చిన తమిళులను వెనక్కి పంపించకుండ, వారి కోసం ఇచ్చిన తాత్కాలిక కాలనీలను శాశ్వతం చేసేసి ఆ భూమిని కంపెనీలకు లీజు కిచ్చారు. ఇప్పుడు అదే ఆలోచన శ్రీలంక ప్రభుత్వం చేస్తున్నట్టుంది. ఎల్‌టిటిఇ పైన యుద్ధానికి సహకరించిన దేశాలన్నీ ప్రతిఫలం కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే రైల్వే వ్యవస్థ పునరుద్ధరణను జాఫ్నా దాకా పొడిగించే కాంట్రాక్టు ఒక పాకిస్థానీ సంస్థకు ఇవ్వబడిందట. మన అంబానీలకూ జిందాల్‌కూ 'అవకాశాలు' కావాలి. చైనా కంపెనీలకూ కావాలి. తమిళులు తిరిగి పోరాని 'జంగిల్' వీరందరికీ భోజ్యం కానుంది. తమిళులు శాశ్వత కాలనీలుగా మారిన క్యాంపుల్లో స్థిరపడవలసి ఉంటుంది.



రాజపక్షె వాయిదా వేస్తున్న 'వికేంద్రీకరణ' నిజానికి కొత్త విషయం కాదు. 1987లో శ్రీలంక రాజ్యాంగానికి చేసిన 13వ సవరణ అమలును వాయిదా వేస్తున్నాడంతే. అది తమిళులు కోరుకున్నది కూడా కాదు. రాజీవ్ గాంధీ ప్రభుత్వంలోని భారత ప్రభుత్వ అధికారులు శ్రీలంక ప్రభుత్వాన్నీ ప్రభాకరన్‌నూ బలవంత పెట్టి ఒప్పించినది. దానిని అమలు చేసినా శ్రీలంక తమిళుల స్వయం పాలనాకాంక్షకు అది జవాబు కాదు. ఆ రాజ్యాంగ సవరణ ద్వారా జరిగిందేమిటంటే భారత రాజ్యాంగంలోని కేంద్ర రాష్ట్ర సంబంధాలను కొన్ని కీలక అంశాలలో (శ్రీలంక ప్రభుత్వాన్ని ఒప్పించడం కోసం) కుదించి శ్రీలంకకు ఎగుమతి చేయడం. దానిని ఉన్నదున్నట్టు ఎగుమతిచేసి ఉన్నా శ్రీలంకలోని జాతుల సమస్యకు అది మన దేశంలో చేసిన పాటి న్యాయం కూడ చేయదు. కుదించడం వల్ల దానిని మరింత బలహీనం చేశారు. భారతదేశాన్ని కూడ జాతుల సముదాయంగా వర్ణించడం జరుగుతున్నది గానీ ఇక్కడ జాతుల మధ్య భాష, ప్రాంతీయ సంస్కృతులు తీసుకొచ్చిన తేడాల కంటే ఆయా జాతుల ఆధిపత్య వర్గాల మధ్య బ్రాహ్మణీయ హిందుత్వ సంస్కృతి, గుర్తింపు తీసుకొచ్చిన ఐక్యతే ఇప్పటిదాకా బలంగా ఉంది. ఆ వర్గాలు భారతదేశాన్ని 'తమది'గా ఉమ్మడిగా భావిస్తాయి. ఆర్యావర్తం అన్న వైదిక భావన దీనికొక భావజాలంగా పనిచేస్తున్నది. ఒబిసిలు ఆయా ప్రాంతాలలో రాజకీయాలలోపైకి వచ్చిన క్రమంలో కూడ ఏ కారణంగానైతేనేం ప్రాంతీయంగా విడిపోకుండ తమను తాము ఒక అఖిల భారత వర్గంగానే భావించుకొని ప్రాంతాలకు అతీతంగా చేతులు కలుపుతున్నారు. భాషా ప్రాంతాలకు అతీతంగా పెరియార్, ఫూలె, అంబేద్కర్, లోహియా వంటివారిని తమ దార్శనికులుగా గుర్తిస్తున్నారు.

దీనికి పూర్తిగా వెలుపల ఉన్న కాశ్మీర్, నాగా ప్రజలు మాత్రమే తమకు భారతదేశంతో ఏ సంబంధం లేదనీ వేర్పాటు కావాలనీ అలసట లేకుండ పోరాడుతున్నారు. వారు భారత పాలకులను ఎంతగా ఇబ్బంది పెట్టినప్పటికీ అవి పరిమాణంలో చాలా చిన్న జాతులు కావడం వల్ల ఫెడరలిజం అంటేనే భయపడే పరిస్థితి భారత పాలకులకు లేదు. అందువల్ల భారత రాజ్యాంగంలోని పాక్షికమైన ఫెడరల్ సూత్రాలను (అప్పుడప్పుడు అతిక్రమిస్తున్నప్పటికీ) మొత్తంమీద గౌరవించడం జరుగుతున్నది. సుప్రీంకోర్టు ప్రత్యేకించి కేంద్రం నియమించే గవర్నర్ అధికారాలను చాలా పరిమితమైనవిగా వ్యాఖ్యానించి రాష్ట్ర ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వానిదే పైచేయి అని (కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప) రాజ్యాంగానికి అర్థం చెప్పింది. శ్రీలంక పరిస్థితి వేరు. అక్కడ ఒకే ఒక బలమైన పాలక జాతి ఉంది. ఆ దేశం తనదేనని ఆ జాతి (బౌద్ధ సింహళీయులు) భావిస్తుంది. పెద్దసంఖ్య గల పాలిత జాతి ఉంది. రెండిటిలోని ఆధిపత్య వర్గాల మధ్య సహితం బలమైన సాంస్కృతిక బంధం లేదు. కాబట్టి ఇవే సూత్రాలు అక్కడ వేరే అర్థం పొందగలవు. శ్రీలంక సుప్రీం కోర్టులో 13వ రాజ్యాంగ సవరణ గురించి వచ్చిన కేసులలో శ్రీలంక ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టంగానే చెప్తున్నది. 'భారత న్యాయస్థానాల వ్యాఖ్యానాలు ఇక్కడ వర్తించవు. వారిది ఫెడరల్ రాజ్యాంగం, మనది యూనిటరీ రాజ్యాంగం'అని ప్రభుత్వ న్యాయవాదులు వాదిస్తున్నారు. మనది ఏపాటి ఫెడరల్ రాజ్యాంగం అనేది ఇక్కడ ప్రశ్న కాదు. ఈ రాజ్యాంగ పరిభాష వెనక ఉన్నది పైన వివరించిన సామాజిక వాస్తవికత.

ఆ రాజ్యాంగ సూత్రాలను కొన్ని ముఖ్య విషయాలలో ఎలా కుదించారో చూద్దాం. కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉండే విషయాల జాబితాను, రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఉండే విషయాల జాబితాను వేరు వేరుగా ప్రకటిస్తూ అయితే ఏ జాబితాలోని విషయం పైనయినా విధాన సూత్రాలు (పాలసీ) రూపొందించే అధికారం మాత్రం కేంద్రానిదేనన్నారు. అంటే రాష్ట్రాలు తమకు అధికారం ఉన్న విషయాల పైన సహితం కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధాన సూత్రాలకు లోబడి చట్టాలు చేయాలి. భారత రాజ్యాంగంలోని కేంద్ర రాష్ట్ర సంబంధాలలో ఆ పరిమితి లేదు. భూమి యాజమాన్యం మరొక కీలక అంశం. శ్రీలంక రాజ్యాంగపు 13వ సవరణ దేశంలోని భూమిపైన అధికారం యావత్తు కేంద్రానికి అప్పగించింది. తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను సింహళీయులకు అప్పగించి అక్కడ సింహళీయుల ఆవాసాలనూ జనాభానూ క్రమంగా పనిగట్టుకొని పెంచుతున్నారన్నది తమిళులు మొదటినుంచి చేస్తున్న అభియోగం. ఆ అవకాశం 13వ రాజ్యాంగ సవరణ తరువాత కూడ శ్రీలంక ప్రభుత్వం చేతిలో కొనసాగుతుంది. భారత రాజ్యాంగంలో అడవి భూములు తప్ప తక్కిన భూములపైన అధికారం రాష్ట్రాలదే. పోలీసు వ్యవస్థ విషయంలోనూ శ్రీలంకలో కేవలం దైనందిన నేరాల నిరోధం, పరిశోధన మాత్రమే రాష్ట్ర జాబితాలోని విషయం. 'పబ్లిక్ ఆర్డర్' కేంద్రానికి అప్పగించబడింది. అంటే జాతి ఆకాంక్ష పేరిట తమిళ ప్రాంతాలలో ఏ కొంచెం అలజడి జరిగినా కేంద్రం నేరుగా రంగంలోకి దిగవచ్చు. రాష్ట్రం తన ఆర్థిక అవసరాల కోసం వసూలు చేసే పన్నుల మోతాదు కూడ కేంద్రం నిర్ణయించే పరిమితికి లోబడి ఉంటుంది.

అంతంత మాత్రంగా ఉన్న భారత ఫెడరలిజాన్ని ఈ విధంగా కుదించి తయారుచేసిన 13వ రాజ్యాంగ సవరణను అమలు చేస్తే చాలని ఇండియా, అమెరికా శ్రీలంక ప్రభుత్వానికి హితవు చెప్తున్నాయి. 'చూద్దాం, తొందరేముంది' అని రాజపక్షె అంటున్నాడు. అతని మీద ఏరకమైన ఒత్తిడి పెట్టే స్థితిలో శ్రీలంక తమిళులు లేక పోవడం అన్నిటి కంటె విచారకరం. వారి రాజకీయ సంకల్పాన్నీ, చొరవను అటు ఎల్‌టిటిఇ, ఇటు శ్రీలంక ప్రభుత్వం మూల్గులు పీల్చినట్టు పీల్చేశాయి. వారి భవిష్యత్తు గురించి ఏ రకమైన ఆశాభావం వ్యక్తం చేసే స్థితి ఇవాళ లేదు.